దొడ్డు బియ్యం తీసుకెళ్లరూ!

- మిగులు బియ్యం తరలింపులో అధికారుల జాప్యం
- బియ్యంలో లక్క పురుగులు
- త్వరగా తరలించాలని కోరుతున్న రేషన్ డీలర్లు

ఖిలా వరంగల్: ఏప్రిల్ నుంచి రేషన్ దుకాణాల ద్వారా ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేస్తోంది. వరంగల్ జిల్లాలో చాలామంది రేషన్ డీలర్ల వద్ద దొడ్డు బియ్యం నిల్వలు ఇంకా మిగిలే ఉన్నాయి. వాటిని వెనక్కి తీసుకోకుండానే సంబంధిత అధికారులు జిల్లావ్యాప్తంగా రేషన్ దుకాణాలకు సన్న బియ్యాన్ని సరఫరా చేశారు. మే నెలలోనూ సన్న బియ్యమే పంపిణీ చేశారు. రెండు నెలల నుంచి డీలర్ల దుకాణాల్లో దొడ్డు బియ్యం నిల్వలు అలాగే ఉండిపోయాయి.

ఇరుకు గదులతో ఇబ్బందులు

వరంగల్ జిల్లాలోని ఖిలా వరంగల్, వరంగల్ మండలాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో చాలాచోట్ల గదులు ఇరుకుగా ఉండడంతో సన్నబియ్యం నిల్వ చేసేందుకు స్థలం ఉండడం లేదు. పాత నిల్వలు అలాగే ఉండటంతో బియ్యానికి లక్క పురుగులు


ఓ రేషన్ షాపులో ఉన్న దొడ్డు బియ్యం నిల్వలు

పడుతున్నాయి. దొడ్డు బియ్యం నిల్వలపై ఎలుకల స్వైర విహారం చేయడం వల్ల ఆర్థికంగా నష్టం వాటిల్లుతుందని డీలర్లు వాపోతున్నారు.

600 మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యం నిల్వలు

జూన్, జులై వరకు వేచి చూస్తే దొడ్డు బియ్యం నిలవలకు పురుగు పట్టి, ఎలుకలు బుక్కేస్తాయని పలువురు డీలర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంకొన్నాళ్లు ఆగితే అవి పూర్తిగా పురుగు పట్టి పిండిగా మారే అవకాశం ఉంది. దీనిపై చర్యలు తీసుకోవాలని అధికారులను డీలర్లు కలిసి మొర పెట్టుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 509 రేషన్ దుకాణాల్లో సుమారు 600మెట్రిక్ టన్నుల వరకు దొడ్డు బియ్యం నిల్వలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి కిష్టయ్యను వివరణ కోరగా.. దొడ్డు బియ్యం తరలింపునకు ఉన్నతాధికారుల నుంచి అనుమతి రాలేదని, వచ్చిన వెంటనే, తరలింపునకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

దొడ్డు బియ్యం తరలించాలి



సన్నబియ్యం పంపిణీతో రెండు మాసాలుగా దొడ్డు బియ్యం నిల్వలు చాలా షాపుల్లో ఉన్నాయి. రేషన్ షాపునకు యజమానులు గదులు అద్దెకు ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. ఇరుకు గదుల్లో దొడ్డు బియ్యం నిల్వలు ఉండగా, సన్నబియ్యం దిగుమతి చేసుకోవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. దొడ్డు బియ్యానికి లక్క పురుగులు పడుతున్నాయి. ఎలుకలు స్వైర విహారం చేస్తున్నాయి. అధికారులు స్పందించి దొడ్డు బియ్యం నిల్వలను ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించేందుకు చర్యలు తీసుకోవాలి.

– ఎర్ల సూర్యనారాయణ, రేషన్ డీలర్, ఖిలా వరంగల్

క్లుప్తంగా

శనీశ్వరుడికి ప్రత్యేక పూజలు



హన్మకొండ కల్చరల్ : వేయిస్తంభాల దేవాలయంలో వైశాఖ బహుళ అమావాస్య శనీశ్వరుడి జయంతిని పురస్కరించుకుని శనీశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వేదపండితులు మణికంఠశర్మ, అర్చకులు సందీప్‌శర్మ రుద్రేశ్వరస్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ నాట్యమండపంలో ఉత్సవ నవగ్రహదేవతలను ప్రతిష్ఠించి శనీశ్వర స్వామికి గణపతి నవగ్రహ ఆరాధన చేసి నల్ల నువ్వులు, తైలాభిషేకం, నీలిరంగు వస్త్రం, చిమ్మిలిని నైవేద్యంగా సమర్పించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని శనిదోష నివారణకు శనీశ్వరుడికి పూజలు చేశారు.

శ్వేతార్క ఆలయంలో నాగదండం పూజలు

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో మంగళవారం రాత్రి నాగదండం పూజలు నిర్వహించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు అయినవోలు రాధాకృష్ణశర్మ ఆధ్వర్యంలో నాగదండానికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, ఆలయ ప్రధాన అర్చకులు సాయికృష్ణ శర్మ, తుమ్మ శ్రీనివాస్, దేవులపల్లి సదానందం, శనిగరం రాజ్‌మోహన్, తదితరులు పాల్గొన్నారు.

వృక్షసంపదను కాపాడాలి



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో వృక్ష సంపదను కాపాడాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) కేయూ కమిటీ అధ్యక్షుడు సాయికుమార్, కార్యదర్శి బీరెడ్డి జశ్వంత్ కోరారు. ఈమేరకు క్యాంపస్‌లో వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డిని మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూనివర్సిటీలో వివిధ కారణాలను చూపుతూ ఏపుగా పెరిగిన చెట్లను కొట్టివేస్తున్నారని పేర్కొన్నారు. అలాగే, క్యాంపస్‌లో విద్యుత్ దీపాలు లేని చోట అమర్చాలని సూచించారు. కార్యక్రమంలో సందీప్, రాహుల్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం



కేయూ క్యాంపస్: మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహద పడుతాయని సుబేదారి పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ అన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తనయుడు విశాల్‌రెడ్డి ట్రస్ట్ పేరిట నాయిని యువసేన ఆధ్వర్యంలో హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో క్రికెట్ పోటీలు కొనసాగుతున్నాయి. పోటీలను సీఐ సత్యనారాయణ రెడ్డి మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. యువత క్రీడలపట్ల ఆసక్తి పెంచుకొని రాణించాలని సూచించారు. క్రీడాపోటీల్లో గెలుపోటములు సహజమని, క్రీడాస్ఫూర్తితో పాల్గొనాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని చెప్పారు.

లైసెన్స్ డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలి



మడికొండ: లైసెన్స్ కలిగిన విత్తన డీలర్ల వద్దనే రైతులు విత్తనాలను కొనుగోలు చేయాలని కాజీపేట వ్యవసాయ అధికారి సంతోష్ సూచించారు. మడికొండలోని రైతు వేదికలో రైతులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానాకాలం సీజన్ ప్రారంభమవుతున్న క్రమంలో రైతులు పాటించాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. విత్తనాలకు సంబంధించిన బిల్లులను పంటకాలం పూర్తి అయ్యే వరకూ భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. వేసవిలో లోతైన దుక్కులు దున్నుకుంటే అధిక వేడికి భూమిలో ఉన్న చీడ పీడల లార్వా చనిపోతుందని వివరించారు. వరి విత్తనాలు నాటే ముందు విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. రైతులు తొందరపడి పత్తి విత్తనాలు నాటరాదన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు భరత్, సంధ్య పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో అధికారులు విఫలం


గోపాల్‌పూర్ చెరువు కింది ప్రాంతాలను పరిశీలిస్తున్న నాయకులు


ఖిలా వరంగల్: బీరన్నకుంటలో సర్వే చేస్తున్న నాయకులు

హన్మకొండ: సమస్యల పరిష్కారంలో అధికారులు విఫలమయ్యారని సీపీఎం నాయకుడు వాంకుడోతు వీరన్న విమర్శించారు. హనుమకొండలోని వడ్డెపల్లి చెరువు నుంచి గోపాల్‌పూర్ చెరువు మీదుగా 100 ఫీట్ల రోడ్డులోని బ్రిడ్జి వరకు సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక సమస్యలపై మంగళవారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023లో వరద వచ్చినప్పుడు వడ్డెపల్లి చెరువు మత్తడి నుంచి గోపాల్‌పూర్ చెరువు కింది వరకు నాలాకు ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మించి సప్తగిరి కాలనీ, జవహర్ కాలనీ, ఎన్జీవోస్ కాలనీ –2, ద్వారకసాయి కాలనీ, రేణుక ఎల్లమ్మ కాలనీల ప్రజలకు వరద ముంపు నుంచి రక్షణ కల్పిస్తామని చెప్పి ప్రజలను ప్రభుత్వం మోసం చేసిందన్నారు. గోపాల్‌పూర్ చెరువు హద్దులు గుర్తించి ఆక్రమణదారుల నుంచి ప్రభుత్వ భూములు కాపాడాలని, గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. సర్వేలో వి.రాజు, మంజుల, చారి, మానస, సబిత, రాధిక, స్వప్న పాల్గొన్నారు.

సమస్యలపై ఇంటింటి సర్వే

ఖిలా వరంగల్: వరంగల్ 32వ డివిజన్ కరీమాబాద్ జ్యోతికాలనీలో సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక సమస్యలపై మంగళవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కరీమాబాద్ కార్యదర్శి సింగారపు బాబు హాజరై సర్వే ప్రారంభించి మాట్లాడారు. బీరన్న కుంటలో వీధి దీపాలు వెలగడం లేదని, డ్రెయినేజీలో చెత్తాచెదారం పేరుకుపోయిందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు గున్నాల ప్రభాకర్, ఉపేందర్, వాణి, రమ్య, వాణి, మాదాసి దివ్య, కోరె విజయ, బోరగాని రజిత, తేజ, యాసుబీ, కాళీమాత పాల్గొన్నారు.

తల్లిబిడ్డకు మెరుగైన వైద్యసేవలు


సమావేశంలో మాట్లాడుతున్న అప్పయ్య

- హనుమకొండ డీఎంహెచ్‌ఓ అప్పయ్య

ఎంజీఎం /హన్మకొండ చౌరస్తా: జిల్లాలోని ఆరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 24 గంటలు మాతాశిశు సంక్షేమానికి మెరుగైన వైద్యసేవలు అందించేందుకు చర్యలు చేపట్టినట్లు హనుమకొండ జిల్లా వైద్యాధికారి అప్పయ్య తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీ, బస్తీ దవాఖానాల్లో పనిచేస్తున్న నర్సింగ్ ఆఫీసర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. ఆయా పీహెచ్‌సీలతో పాటు అవసరమైన చోట నర్సింగ్ ఆఫీసర్లు, ఎంఎస్‌ఓలను డిప్యుటేషన్‌పై పంపిస్తామన్నారు. ఎన్‌సీడీ రీ స్క్రీనింగ్, గర్భిణులకు అవసరమైన పరీక్షలు నిర్వహించడం, వారిని సాధారణ ప్రసవాలకు ముఖ్యంగా ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవం జరిగేలా కౌన్సెలింగ్ చేయాలన్నారు. సమావేశంలో ఎన్‌సీడీ రాష్ట్ర కోఆర్డినేటర్ సత్యేంద్రనాథ్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఇక్తాదార్ అహ్మద్, జిల్లా మాస్ మీడియా అధికారి అశోక్‌రెడ్డి, నర్సింగ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

పెద్దమ్మగడ్డ యూపీహెచ్‌సీ సందర్శన

పెద్దమ్మగడ్డలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ అప్పయ్య మంగళవారం తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రం పరిధిలో దోమల నివారణకు ప్రజలు మంగళవారం, శుక్రవారం డ్రై డే పాటించేలా అవగాహన కల్పించాలన్నారు.

ఎమ్మెల్యే నాయినిని కలిసిన కేడీసీ ప్రిన్సిపాల్ శ్రీనివాస్


ఎమ్మెల్యే నాయినిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు

కేయూ క్యాంపస్: వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గుర్రం శ్రీనివాస్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కళాశాలలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో కేడీసీ స్టాఫ్ క్లబ్ సెక్రటరీ రవికుమార్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం బాధ్యుడు డాక్టర్ చిన్న పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై సీపీఎం పోరాటం

- పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు చుక్కయ్య

కాజీపేట అర్బన్: ప్రజా సమస్యల పోరాటానికి సీపీఎం సిద్ధంగా ఉందని పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు ఎం.చుక్కయ్య అన్నారు. 31వ డివిజన్ పరిధిలోని సుర్జిత్‌నగర్‌లో నాయకుడు కారు ఉపేందర్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన విస్తృత స్థాయి సమావేశంలో చుక్కయ్య మాట్లాడారు. ప్రభుత్వంపై రాజీలేని పోరాటాలు నిర్వహించాలని సూచించారు. పంటలకు మద్దతు ధర, గుడిసెవాసులకు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, భూములు కోల్పోయిన బాధితులకు న్యూశాయంపేటలో డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలని, అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ఓరుగంటి సాంబయ్య, జంపాల రమేష్, కలకోటి విమల, ప్రభాకర్, రజిత, సుజాత తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చుక్కయ్య

విద్యుదాఘాతంతో గొర్రెలు మృతి



మడికొండ: విద్యుదాఘాతంతో నాలుగు గొర్రెలు మృతి చెందిన సంఘటన మడికొండ శివారులో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మడికొండ గ్రామానికి చెందిన తొర్రి మల్లయ్య కుమారుడు చంటి గొర్రెలను మేపడానికి మడికొండ శివారులోని ఐటీ పార్కు వెనుకకు తోలుకొని వెళ్లాడు. అక్కడ విద్యుత్ సరఫరా ఉన్న తీగ తెగి కిందపడి ఉంది. ఈక్రమంలో ఆ తీగకు తగిలి 4 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. వాటి విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని, తమను ఆదుకోవాలని బాధితుడు మల్లయ్య కోరాడు.

సంబురాలను విజయవంతం చేయాలి

రామన్నపేట: తెలంగాణ జర్నలిస్ట్స్ ఫోరం ఆవిర్భవించి మే 31వ తేదీతో 25ఏళ్లు అవుతున్న సందర్భంగా హైదరాబాద్ జలవిహార్‌లో నిర్వహిస్తున్న రజోత్సవాలను విజయవంతం చేయాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (హెచ్ –143) వరంగల్ జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష, కార్యదర్శులు మిట్ట నవనీత్, నీలం శివ పిలుపునిచ్చారు. ఈమేరకు సంఘం నాయకులతో కలిసి వరంగల్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ చేతుల మీదుగా సంబురాల వాల్‌పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు బండి రవి, వెలిషాల పూర్ణచందర్, ఉపాధ్యక్షుడు అమీర్, కార్యవర్గ సభ్యులు హరినాథ్, బందెల కృష్ణ, రాజేష్, భాస్కర్ పాల్గొన్నారు.

రజతోత్సవ సభ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

ఖిలా వరంగల్: ఈనెల 31 హైదరాబాద్ జలవిహార్‌లో నిర్వహించనున్న తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే హెచ్ –143) రజతోత్సవ సభ వాల్‌పోస్టర్లను వరంగల్ రవాణాశాఖ కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు మిట్ట నవనీత్, కార్యదర్శి నీలం శివ, ఇన్‌చార్జ్ ఆర్టీఓ శోభన్‌బాబు, జర్నలిస్టులు బండి రవి, వెలిషాల పూర్ణచందర్, ఉపాధ్యక్షుడు అమీర్, కార్యదర్శివర్గ సభ్యులు హరినాథ్, బందెల కృష్ణ, రాజేష్, భాస్కర్ పాల్గొన్నారు.


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న శోభన్‌బాబు, జర్నలిస్టులు

దేశ సార్వభౌమత్వానికే ప్రమాదం



మాట్లాడుతున్న మద్దికాయల అశోక్

వరంగల్ చౌరస్తా: బీజేపీ పాలనలో దేశ సార్వభౌమత్వానికి ప్రమాదం పొంచి ఉందని మార్కిస్ట్ కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (ఐక్య) దేశ ప్రధాన కార్యదర్శి మద్దికాయల ఓంకార్ అన్నారు. వరంగల్ స్టేషన్ రోడ్డులోని ఓ హోటల్‌లో రాజస్తాన్ రాష్ట్ర కార్యదర్శి మహేందర్ నేహ అధ్యక్షతన ఎంసీపీఐ (యూ) పొలిట్ బ్యూరో సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ అంతర్జాతీయ, జాతీయ పరిణామాలపై కేంద్ర ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని విమర్శించారు. అమెరికా సామ్రాజ్యవాదం ప్రత్యేక జోక్యంతో కేంద్ర ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉంటుందో అర్థం కావడం లేదని అన్నారు. మావోయిస్టులతో కేంద్రం చర్యలు జరపాలని సూచించారు. ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసులు, మావోయిస్టులను హత్య చేయడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు కిరణ్ జిత్‌సింగ్ షేఖాన్, గాదగోని రవి, అనుభవ్ దాస్‌శాస్త్రి, వల్లెపు ఉపేందర్ రెడ్డి, కాటం నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం చెరువుకు పూర్వ వైభవం


కబ్జాకు గురైన గోపాలపురం చెరువు

- పిచ్చిమొక్కల తొలగింపు ప్రక్రియ ప్రారంభం
- హద్దుల నిర్ధారణకు చర్యలు
- చెరువు శిఖం కబ్జా

హసన్‌పర్తి: 56వ డివిజన్ గోపాలపురం చెరువు పూర్వవైభవం కోసం స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇటీవల ఇరిగేషన్‌శాఖ అధికారులతో జరిగిన సమీక్షలో గోపాలపురం చెరువుపై సుదీర్ఘంగా చర్చించారు. ఈమేరకు చెరువులో ఉన్న పిచ్చిమొక్కల తొలగింపు ప్రక్రియను మంగళవారం చేపట్టారు. జేసీబీ ద్వారా చెత్తాచెదారం, వ్యర్థాలను తొలగిస్తున్నారు.

ఇప్పటికే చెరువు శిఖం కబ్జా

గోపాలపురం సర్వే నంబర్ 89లో సుమారు 20.1 ఎకరాల్లో చెరువు విస్తరించి ఉంది. నగరంలో విస్తరించడంతో రియల్టర్ల కన్ను చెరువుపై పడింది. దీంతో కొంతమంది రియల్టర్లు ఈ చెరువు శిఖాన్ని కబ్జా చేసి ఏకంగా అమ్మకాలు చేపట్టారు. సుమారు 10 ఎకరాల భూమిలో నిర్మాణాలు కూడా వెలిశాయి. చెరువు కబ్జాకు గురికావడంతో పరిసరాల ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి.



పిచ్చిమొక్కలను తొలగిస్తున్న సిబ్బంది

వర్షాకాలంలో ఈ ప్రాంతంలో ఉన్న కాలనీలు వరద తాకిడికి గురవుతున్నాయి. కబ్జా గురైన భూములను వెంటనే స్వాధీనం చేసుకోవాలని హైకోర్టును ప్రజాతంత్ర ఆలోచన వేదిక వ్యవస్థాపకుడు దశరథం ఆశ్రయించారు. ఇందులో కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌తో పాటు వివిధ విభాగాలకు చెందిన అధికారులను బాధ్యులుగా చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు. ఈమేరకు వారికి నోటీసులు కూడా అందాయి. కాగా, గోపాలపురం చెరువుకు హద్దులు నిర్ధారిస్తామని ఎమ్మెల్యే నాగరాజు తెలిపారు. చెరువు శిఖంలో వెలిసిన కట్టడాలను కూల్చివేస్తామన్నారు. త్వరలోనే వరంగల్‌లో వాడ్రా అమలు చేయనున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు.

ఆటో కార్మికులకు భృతి ఇవ్వాలి

న్యూశాయంపేట: ఆటో కార్మికులకు రూ.12 వేల భృతిని వెంటనే ఇవ్వాలని సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ డిమాండ్ చేశారు. రాంగనగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆటో యూనియన్ నాయకుడు మందుల శ్రీనివాస్ అధ్యక్షతన ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఆర్థిక వ్యవస్థకు రవాణా రంగం వెన్నెముక లాంటిదని అన్నారు. కేంద్రం తీసుకొచ్చిన 2019 మోటారు వాహనాల చట్టాన్ని సవరించాలని డిమాండ్ చేశారు. రవాణా రంగ కార్మికులపై ఫైనాన్సర్ల వేధింపులను అరికట్టాలని రాగుల రమేష్ కోరారు. ఈ సమావేశంలో ఆటో వర్కర్స్ జిల్లా కన్వీనర్ ధరావత్ భానునాయక్, లింగమూర్తి, రాజు, సుధాకర్, ఎండీ.కుదాన్, సమ్మయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

కాజీపేటలో వాహన తనిఖీలు

కాజీపేట: ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు సంయుక్తంగా కాజీపేట చౌరస్తాలో మంగళవారం రాత్రి వాహన తనిఖీలు చేపట్టారు. సీఐ వై.సుధాకర్ రెడ్డి పర్యవేక్షణలో పోలీస్ సిబ్బంది పలు ప్రాంతాల్లో పికెటింగ్ ఏర్పాటు చేసి మైనర్ డ్రైవింగ్, నంబరు ప్లేట్లు లేకుండా తిరుగుతున్న వాహనాలు, మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 50మందికి పైగా అదుపులోకి తీసుకుని జరిమానాలు విధించారు. సరైన కాగితాలు లేకపోవడం, హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేస్తున్న వాహనదారులకు సీఐ సుధాకర్ రెడ్డి కౌన్సెలింగ్ నిర్వహించారు. తనిఖీల్లో ఎస్సైలు కనకచంద్రం, సంపత్, శివకృష్ణ, నవీన్‌కుమార్, లవన్‌కుమార్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.


వాహన తనిఖీలు చేస్తున్న సీఐతో సిబ్బంది

కొనసాగుతున్న నాలా పూడికతీత పనులు


పూడికతీత పనులను పర్యవేక్షిస్తున్న నాయకులు

కాజీపేట రూరల్: కాజీపేట బాపూజీనగర్ – బూడిదిగడ్డ ప్రాంతంలో రైల్వే ప్రాంతాన్ని ఆనుకొని ఉన్న భారీ నాలా పారిశుద్ధ్య పనులు రెండో రోజు మంగళవారం కొనసాగాయి. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి చొరవతో రైల్వే అధికారులు, మున్సిపల్ అధికారులు సిబ్బంది నాలా పూడికతీత పనులను సోమవారం చేపట్టారు. పూడికతీతతో వర్షాకాలంలో వరద ముంపు బాధలు తప్పనున్నాయని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు మైసారపు సిరిల్‌లారెన్స్, షేక్ అజ్జర్, ఇప్ప శ్రీకాంత్, దొంగల కుమార్, ఎండీ.బిలాల్, విజయభాస్కర్, టి.మధు, దువ్వ రాజు, పోగుల శ్రీనివాస్, దార్ల రాజ్‌కుమార్, మాతంగి స్వామి, బిడారి రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

మంద కృష్ణకు ఘన స్వాగతం పలకాలి



కాజీపేట: భారత అత్యున్నత పౌర పురస్కారాన్ని అందుకుని ఈ నెల 31న వరంగల్ జిల్లాకు వస్తున్న మంద కృష్ణ మాదిగకు ఘన స్వాగతం పలకడానికి సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్ మాదిగ పిలుపునిచ్చారు. కాజీపేట పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో సురేష్ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర, జాతీయ నాయకులు అనుబంధ సంఘాల కార్యకర్తలు భారీగా తరలిరావాలని కోరారు. హనుమకొండ కాళోజీ కళాక్షేత్రంలో జరగనున్న అభినందన సన్మానసభను విజయవంతం చేయాలని సూచించారు. సమావేశంలో మంద రాజు, జన్ను దినేష్, బండారి సురేందర్, సుకుమార్, అక్కనకుంట వెంకటస్వామి, జేరిపోతుల సతీష్ తదితరులు పాల్గొన్నారు.